


కె. వి. యల్.

ఇందు ఏదో ఒక పుస్తకమూ, కొన్ని కాగితాలూ, ఒక ఫౌంటెన్ కలమూ, చేత బట్టుకొని గబగబా మేడ మెట్లెక్కుతున్నది. సావడిలో నిలబడి ఉన్న జానకి ఇందువైపు చూచి 'ఆ చేతిలో పుస్తక మేమిటే ఇందూ' అన్నది.

'ఇదొక తమాషా పత్రిక అక్కా.'

'వస్తూ ఉన్న పత్రికలన్నీ గాక తమాషా పత్రికలని గూడా వస్తున్నాయేమిటే?'

'దీని పేరు యిదిగాదు లే, కాని దీనిలో ఉన్నవన్నీ తమాషాలే గనుక అట్లా అన్నాను.'

''ఓహో! ఇది నీవు పెట్టిన పేరా? నీ కెక్కడిది పుస్తకం?''

'మొన్న మామయ్యగారి ఊరినుంచీ వస్తూ త్రోవలో తెనాలి స్టేషనులో కొన్నాను.'

'అవును, ఇటువంటి వెకిలి పత్రికలు అమ్మడానికి ఆ స్టేషను ప్రసిద్ధిలే. ఏదీ, ఆ పత్రిక యిట్లా తే.'

'అబ్బా! నే నివ్వను.'

'ఒకమాటు చూచి యిస్తా. నీ పత్రిక నాకు వద్దులే.'

'ఆఁ హుఁ, నే నివ్వను.'

'ఎందు కివ్వవు?'

'ఇస్తే బావ కిస్తావు.'

'ఏమి? యిస్తే.'

'దీనిలో కథలన్నీ ఆడవాళ్లను వెక్కిరించేవే.'

'అయితే.'

'బావ కిస్తే యివన్నీ చదివి ఈ మాటలు పట్టుకొని నిన్నూ నన్నూ ఎగతాళి చేసి ఏడిపిస్తాడు. ఏమయినా సరే పెద్ద బావకూ చిన్న బావకూ యీ సంచిక దిక్కనియగూడదు.'

'పరవాలేదు. మీ బావగారికి చూపను గాని ఒక మాటియ్యి, ఆ వెక్కిరింత లేమిటో చూస్తాను.'

'చేతిలో ఒట్టేయి.'

'ఏమని?'

'బావ కివ్వనని.'

'ఇవ్వను కాని చేతిలోనుంచి లాక్కొనిపోతే నే నేమి చేసేది?'

'అందుకే నేను నీ కివ్వననేది, చేత గాని పవ్వావు.'

'పోనీ యియ్యకపోతే మానె గాని మేడమీదికి వెళ్లుతున్నా వెందుకు?'

'ఒక పని ఉన్నది.'

'ఏమి పని?'

'ఒకటి వ్రాసుకోవాలె.'

'ఏమి వ్రాసుకుంటావు?'

'ఏదో ఒకటి నీతో చెప్పగూడదు.'

'చెప్పుదూ, ఏమి వ్రాస్తావు?'

'ఒక కథ.'

'ఏమి కథ వ్రాస్తావు?'

'ఏదో వ్రాస్తా నీ కెందుకూ? బావమీద.'

'వ్రాసి'

'వ్రాసి పరిహాస పత్రికకు పంపుతా.'

'వాళ్లు వేసుకోకపోతే'

'పత్రికాధిపతులకు గూడా పక్షపాతమేనని మరో కథ వ్రాసి మన ఆడవాళ్ల పేపరుకు పంపుతా.'

'ఇందూ, నీవు వ్రాసే కథేమిటో కొంచం సూచనగా చెప్పుతావా?'

‘చెప్తే ఏం బాగుంటుంది? వ్రాస్తే చూస్తు గానిగా.’

‘కాను లే. వ్రాసిన తర్వాత మార్చుకోడం కష్టం. ముందుగా చెప్తే బాగుందో లేదో, ఏమైనా మార్పులు చేయాలో, చూద్దాము.’

‘అయితే చిన్న బావనుగాని పెద్ద బావనుగాని యిందులో ఒక ముక్కగూడా చెప్పగూడదు.’

‘ఎందుకు వాళ్లంటే నీ కింత కోపం.’

‘కోప మేమిటి? అక్కా! చిన్న బావ అన్ని కథలు వ్రాస్తున్నాడు గదా మనకు చూపుతున్నాడా? చెప్తున్నాడా? మన మెందుకు చూపాలే?’’

‘సరే వంతుకోసమా? ఏదీ కథ చెప్పు.’

“అనగా అనగా ఒక అబ్బాయి ఆడపిల్ల ముఖంలాగా ఉండటానికి........జూలుజుట్టు నడిం పాపడ తీసుకుంటాడుట. ఆ అబ్బాయి ఒకనాటి సాయంత్రం మామూలుగా తల దువ్వుకొని సబ్బుతో ముఖం కడుక్కొని దోసగింజలాగా బొట్టు పెట్టుకొని ఆడవాళ్ల జాకెట్టుకంటే అధ్వాన్నంగా ఉన్న ఒక పొట్టి చొక్కా తొడుక్కొని జోడు పరికిణీలు పట్టుకొని”

‘జోడు పరికిణీలు కట్టుకోడ మేమిటి నీ మొఖం.’

‘అవును యిప్పుడు చిన్న బావా వాళ్లు కట్టుకొనే లాగూలు మాలంగాలలాగా ఉండటం లేదూ? మేము రెండు కాళ్లకూ కలిపి ఒకే పావడా కట్టుకుంటే వాళ్ళు రెండు కాళ్లకూ రెండు పరికిణీలు కట్టుకుంటున్నారు. అయితే యేమయింది? రెండు పరికిణీలు కా లేదూ?’’

‘ఓసి నీ ఊహలు.’

‘వినూ మరి కథ.’

‘ఆఁ చెప్పూ.’

‘ఒక ఖద్దరు శాలువ ఆడవాళ్ల పమిటలాగానే వల్లెవాటు వేసుకొని సిగరెట్టు కాల్చుకుంటూ నీటుగా సినిమా గేటువద్దకు పోతున్నాడుట. త్రోవలో పేరంటానికి పోయి వస్తూ ఉన్న ఒక చక్కని అమ్మాయి కనుపించిందిట. ఆ అమ్మాయి యెందుకో వెనక్కి తిరిగి చూచి వెంటనే తన త్రోవను వెళ్ళి పోయిందిట. ఈ అబ్బాయికి మాత్రం ఆ అమ్మాయిని చూడగానే మనసులో యేదో వికారం పుట్టి ఒంట్లో యేదో వణుకు పుట్టి, నరాలన్నీ పట్టు తప్పి, ఒళ్లంతా చెమటపోసి ముఖం తెల్ల పడ్డదట. ముందుకు నడవలేక అక్కడే నిలబడ్డాడుట. నిలబడలేక పక్కనే ఒక



లాంతరు స్తంభం ఉంటే దానికి ఆనుకున్నాడుట. ఆనుకొనిగూడా నిలబడలేక ఆఖరికి క్రింద కూల బడ్డాడుట. ఆ అబ్బాయి అట్లా అథాట్టుగా పడిపోవడం చూచి వీధిలో వాళ్లంతా గాభరాపడి ఆ అబ్బాయి కేదో వచ్చిందనుకొని దగ్గరలో ఒక డాక్టరుగారి డిస్పెన్సరీ ఉంటే అక్కడికి తీసుక పోయినారట. ఆ డాక్టరుగారు ఆ అబ్బాయిని బల్లమీద పడుకోబెట్టి గుండెలూ గిండెలూ పరీక్ష చేసి ‘గుండెలు బాగానే కొట్టుకుంటున్నాయి. నాడి బాగానే ఆడుతున్నది. ఒంట్లో యేమీ జబ్బు కనుపించ లేదు గాని నరాలేమో కొంచెం దుర్బలంగా ఉన్నట్టున్నాయి. ఒక్క యింజెక్షను యిస్తా నుండం’డని మందు సూది తీసుకొని చేతిమీద ఒక్కమాటు చురుక్కుమని పించాడుట. సూది గ్రుచ్చుకోంగానే ఆ అబ్బాయి ఉలిక్కిపడి “ఓయి బాబో యిదేమి”టని కేక పెట్టాడుట. అక్కడ ఉన్నవాళ్లంతా తెలివి వచ్చింది, తెలివి వచ్చింది, అని అరిచారుట. ఆ అబ్బాయికి యీ అఱపులకు బాగా తెలివి వచ్చి తెలివే గాక బుద్ధిగూడా వచ్చిందని తన మనసులో అనుకుంటూ చల్లంగా యింటికి చేరుకున్నాడుట. ఆ అబ్బాయి యెవరు? మా చిన్న బావేట. ఇంతకూ ఆ అమ్మాయి వెనక్కి తిరిగి చూచింది, తన

తల్లో పెట్టుకున్న గులాబి పువ్వు జారిపోవడంచేత అది ఎక్కడ పడ్డదో చూద్దామనే కాని, చిన్న బావను చూట్టానికి కానే కాదుట. ఇదీ కథ.”

‘ఛీ యిట్లాంటి కథలు వ్రాస్తే మీ బావలకు కోపం రాదుటే.’

“ఎందుకొస్తుందేం, వాళ్లు వ్రాసుకునే కథలన్నీ యిట్లాంటివేగా? మొన్న చిన్న బావ, ‘శేషు,’ అని చిన్న పేరు పెట్టుకొని హాస్యపు పత్రికకు పంపించాడే ఆ కథ ఎట్లా ఉన్నది చెప్పు. ఎవరో అమ్మాయిని చూచానని, మనస్సులో యేదో అవ్యక్తమైన ఆందోళన కలిగిందనీ, రాత్రి విస్తరి ముందు కూర్చుంటే అన్నం సహించలేదనీ, దీపం ముందర కూర్చుంటే పరీక్ష పుస్తకాలుకూడా చదువ బుద్ధి పుట్టలేదనీ, ఆ రాత్రి నిద్రే సున్నా అనీ, మర్నాడు పరీక్ష పేపరుకూడా పాడుచేశానని యేమేమో వ్రాసుకోలేదూ. తాను వ్రాసుకోవచ్చుగాని నేను వ్రాస్తే తప్పు వచ్చింది కాబోలు.”

“వాళ్లకు వాళ్లు వ్రాసుకుంటే తప్పు లేదు. కాని నీవు ఆడపిల్లవు గదా. మగవాళ్లమీద వ్రాయవచ్చా?”

“వాళ్లు ఆడవాళ్లమీద వ్రాయవచ్చా?”

‘మరి? మన ఆడవాళ్ల కన్నూ, ముక్కూ, మొఖమూ, నడకా, కులుకూ, చీరెలు జీరాడటం, రవికలు పొట్టి కావడం, గోలుసులు తళుక్కు మనడం ఇవేగా వాళ్ల కథలన్నీ.’

“అవును వాళ్లకేమి? వాళ్లు మగవాళ్లు. ఏది వ్రాసినా చెల్లుతుంది. నీవు ఆడపిల్లవు బావలమీద యిట్లా వ్రాయవచ్చా?”

“పెద్ద బావమీద గాదుగా నీ కెందుకూ?”

“పెద్ద బావ కాకపోతే చిన్న బావమీద మాత్రం వ్రాయవచ్చునా?”

“ఏమి వ్రాస్తే. మన చిన్నత్త కొడుకేగా.”

“ఆ అబ్బాయికి నిన్నిచ్చి పెండ్లి చేస్తామనుకుంటూ ఉంటే.”

‘ఆఁ పెండ్లి చేస్తే బావ పెండ్లి కానిచ్చానన్నమాటే.’

‘ఛీ! అల్లరి సన్నాసీ ఊరుకో, ఆ అబ్బాయి వింటే నిజంగా నిన్ను చేసుకోనంటాడేమో.’

“ఎందుకే, అక్కా నన్ను కోప్పడుతావు. చిన్న బావ మన ఆడవాళ్లమీద అన్ని కథలు వ్రాస్తుంటే ఆ బావ నేమీ అనవుగాని, నన్నే అంటావు. పోని చిన్న బావ అంత నన్ను పెండ్లి చేసుకోకపోతే అట్టే ఉంటుందా? ఎక్కడా దొరక్కపోతే అక్క మగడే గతి అంటివే మొన్న యెందుకో.”

‘సరే లే పో! నీ వాగుడు నీవూ.’

“ఇదిగో అక్కా వెళ్లుతున్నావు గాని నా చేతిలో చెయ్యి వెయ్యి.”

‘ఏమని?’

‘నేను చెప్పిన కథ ఎవరితో చెప్పనని.’

‘ఏమిటి అక్క దెబ్బలాడుతూ చేతిలో చేయి వేసుకుంటున్నారు?’

“ఎవరూ? వెనక? ఓయి బాబో పెద బావేవ్. అక్కా ఒట్టూ చెప్పేవు, చెప్పావంటేనా!”



జె. ఓ. ఫోన్సు

నిర్మాణమునకు, నాణ్యతకు పేరెన్నిక గన్న అద్భుతమైన కొలారో మోటారుతో నమర్చబడిన మిషను. దీనిలోని సామాను లన్నియు ఇంగ్లాండులో చేయబడినవి. అయిదు సంవత్సరములు గ్యారంటి. విడి భాగములుగూడ విక్రయించబడును.

ప్రతి చోట్లను ఏజెంట్లు కావలయును.

జె. ఓ. ఫోన్ కంపెని; 2/15 లక్ష్మణదాసు వీధి, పి. టి. మద్రాసు.